క్లుప్తంగా

ప్రతిభావంతులకు ప్రోత్సాహకాలు



నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులతో సొసైటీ సభ్యులు

పాణ్యం : పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన మండల పరిధిలోని మద్దూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం సహాయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ తరుపున సన్న సునీల్‌కుమార్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి సహకారంతో నగదు ప్రోత్సాహకాలు అందించారు. 562 మార్కులు సాధించి పాఠశాలలో మొదటి స్థానంలో నిలిచిన సునయనకు రూ.10వేలు, 500 మార్కులు దాటిన ఐదుగురు విద్యార్థులకు రూ. 2,500 చొప్పున అందజేశారు. అలాగే అదే పాఠశాలలో లైబ్రేరియన్‌గా పని చేస్తున్న మధుసూదన్‌రావు మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థినికి రూ. 5వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన రాఘవికి 3వేలు, జిమున్నీకు రూ.2వేలు చొప్పున అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైల్వే కోచ్ ఫ్యాక్టరీని త్వరగా పూర్తి చేయండి

కర్నూలు(రూరల్): రైల్వే కోచ్ ఫ్యాక్టరీని తర్వగా పూర్తి చేయాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కోరారు. గురువారం కర్నూలు మండలంలోని పంచలింగాల గ్రామం వద్ద నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనుల పరిశీలనకు వచ్చిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కూమార్ జైన్‌ను ఎంపీ కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలోని రైల్వేశాఖకు సంబంధించిన పలు అంశాలపై జీఎంతో చర్చించి పలు సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఎంపీ మాట్లడుతూ కోచ్ ఫ్యాక్టరీలో స్థానికులకు అధిక ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మహబూబునగర్ నుంచి డోన్ వరకు చేస్తున్న డబ్లింగ్ పనులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. అలాగే.. ప్రయాణికుల సౌకర్యార్థం కర్నూలు నుంచి వైజాగ్‌కు ప్రత్యేక రైలు నడపాలని కోరారు.

ప్రవీణ్ పగడాల విషయంలో న్యాయం చేయాలి



మాట్లాడుతున్న పాస్టర్ అసోసియేషన్ నాయకులు

పాణ్యం : పాస్టర్ ప్రవీణ్ పగడాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని పాణ్యం పాస్టర్ల యూనియన్ నాయకులు కోరారు. గురువారం పాణ్యంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల కేసుకు సంబంధించి సరైన విచారణ చేసి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పాస్టర్లు, క్రైస్తవ సోదరులు ప్రభుత్వాన్ని ఇదే డిమాండ్ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం మరోమారు కేసును పూర్తిగా విచారణ చేయించాలని కోరారు. కార్యక్రమంలో పాస్టర్ల అసోసియేషన్ నాయకులు సునీల్, ఏసన్న, జాన్ తదితరులు పాల్గొన్నారు.

కేఎంసీ వైస్ ప్రిన్సిపాల్‌గా సింధియా శుభప్రద



డాక్టర్ సింధియా శుభప్రదకు ఆర్డర్ కాపీ ఇస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు (హాస్పిటల్): కర్నూలు మెడికల్ కళాశాల అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ సింధియా శుభప్రద నియమితులయ్యారు. కళాశాలలోని ఎస్‌పీఎం డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆమెకు గురువారం వైస్ ప్రిన్సిపాల్ బాధ్యతలను ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ ఇస్తూ ఉత్తర్వులు అందజేశారు.

ఎన్‌సీసీ శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మేజర్ చైతన్య రెడ్డి

కర్నూలు (టౌన్) : వన్ ఆంధ్ర మెడికల్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి క్యాంపు కమాండెంట్ మేజర్ చైతన్య రెడ్డి అన్నారు. గురువారం స్థానిక సిస్టర్ స్టాన్సులా ఇంగ్లిష్ మీడియం ప్రాంగణంలో ఎన్‌సీసీ క్యాంప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ క్యాంప్‌లో 10 రోజుల పాటు డ్రిల్, మ్యాప్ రీడింగ్, వేపన్ శిక్షణ, సోషల్ అవేర్నెస్ ఉంటాయన్నారు. ఈ శిక్షణలో 600 మంది క్యా డేట్లు, 9 మంది ఏఎస్ఓలు, సీఐ స్టాఫ్, సివిల్ క్యాంపులు ఉంటాయని తెలిపారు. క్యాంపు నిర్వహకులు దాసరి సుధీర్, ఎన్‌సీసీ ఆఫీసర్లు విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, అనిల్, ప్రతాప్, రవికుమార్, క్యాంప్ సూపరింటెండెంట్ పవన్ కుమార్ పాల్గొన్నారు.



కోడుమూరులో కొర్ర పంటను కోస్తున్న యంత్రం



కోత అనంతరం కొర్రలను రాసిగా పోస్తున్న హార్వెస్టర్

యంత్రాలతో కొర్ర కోతలు

కోడుమూరు రూరల్: ఒకప్పుడు కొర్ర కోతలంటే ఎంతో శ్రమతో కూడుకున్న పని. కొర్ర పంట సాగు చేసిన రైతులు పంట చేతికొచ్చిన తర్వాత పంటనంతా కోసి వాటిని కట్టలుగా కట్టి గూళ్లు వేసి కొద్ది రోజుల తర్వాత మళ్లీ వాటిని మిషన్‌కు వేసుకుని తీసుకుని రావాల్సి ఉండేది. ఈ పనంతా రైతుకు తీవ్రమైన శ్రమతో పాటు, ఖర్చుతో కూడుకున్న పనిగా ఉండేది. దీంతో చాలామంది రైతులు కొర్ర పంట వేయాలంటే ఒకటి రెండు సార్లు ఆలోచించాల్సి వచ్చేది. అయితే ప్రస్తుతం కొర్ర విత్తన సాగుతో పాటు, కొర్ర పంటనే కోసే యంత్రాలు రావడంతో రైతుల పని సులువుగా మారిపోయింది. దీనివల్ల చాలామంది రైతులు బోరుబావులు, ఆరుతడి పంటగా కొర్ర సాగు చేస్తున్నారు.

ఈ ఏడాది మండలంలో జీడీపీ కింద ఆరుతడి పంటగా సుమారు 300కు పైగా ఎకరాల్లో రైతులు కొర్ర పంటను సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికి రావడంతో యంత్రాల సాయంతో కోస్తున్నారు. కోత అనంతరం వచ్చిన ధాన్యాన్ని రైతులు ఒకటి రెండు రోజులు ఆరబెట్టుకుని ఇళ్లకు తరలించుకుంటున్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు





కోడుమూరులో పంచాయతీ సిబ్బందిని సత్కరిస్తున్న దృశ్యం, మాట్లాడుతున్న ఈశ్వరయ్యస్వామి

కోడుమూరు రూరల్: ప్రజలకు చేసే సేవతోనే ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీడీఓ రాముడు అన్నారు. పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ భాగ్యరత్న ఆధ్వర్యంలో పంచాయతీ ఉద్యోగులు, సిబ్బందితో పాటు, రిటైర్డ్ మిలటరీ ఉద్యోగి రాముడును సత్కరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సిబ్బంది తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించినపుడే మంచి పేరు వస్తుందన్నారు. కార్యక్రమంలో ఈఓ అజయ్ భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఆంధ్రయ్య పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషి చేయాలి

సి.బెళగల్: ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి, అభివృద్ధి పథకాలతో పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని ఎంపీపీ బొంతల మునెప్ప సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో, కార్యాలయ అధికారులు శ్రీనివాసులు, జయప్రకాష్, మంజుల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎంపీపీ, అధికారులతో కలిసి మహాత్మా గాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి మాట్లాడుతూ, స్థానిక సంస్థల అధికారాల ద్వారా ప్రజల ఆర్థిక, సామాజిక సమానత్వం సాధ్యమవుతుందని, పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా సేవలందించటం గొప్పగా భావిస్తున్నామన్నారు. పీఆర్ ఏఈ వెంకట ప్రకాష్ గ్రామీణ పరిపాలన, ప్రజా సమస్యల పరిష్కారంపై మాట్లాడారు. వెలుగు ఏపీఎం రామేశ్వర్, ఉపాధిహామీ ఏపీఓ రామన్న, సిబ్బంది పాల్గొన్నారు.

20 మందిపై తేనెటీగల దాడి

గడివేముల: మండల పరిధిలోని రంగల్ దర్వే శిఖాద్రి క్షేత్రంలో గురువారం మొక్కులు తీర్చుకునేందుకు వచ్చిన భక్తులపై తేనెటీగలు దాడిచేశాయి. వెలుగోడు, గోరుకల్లు గ్రామాలకు చెందిన 20 మందిపై ఒక్కసారిగా తేనేటీగలు దాడి చేయడంతో వారికి గాయాల య్యాయి. స్థానిక పీహెచ్‌సీలో చికిత్స చేయించుకున్నారు.

27న అమావాస్య పూజలు

ఓర్వకల్లు : మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ఈ నెల 27న అమావాస్య పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయా ఆలయాల అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. మండలంలోని బొడ్డువానిపల్లె ఆంజనేయస్వామి దేవస్థానంలో ప్రత్యేకంగా మహా సుదర్శన యజ్ఞం నిర్వహించనున్నారు. ఆదేవిధంగా 26న రాత్రి నుంచి 27వ తేదీ ఉదయం వరకు భజన కార్యక్రమాలు ఉంటారు. 27న భక్తుల కాలక్షేమ నిమిత్తం కోలాట, నందికోల సేవ కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వాముల వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

విద్యార్థులకు అభినందనలు

కల్లూరు: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన కల్లూరులోని శ్రీ ఆదిత్య విద్యాలయం పాఠశాల విద్యార్థులను పాఠశాల అధినేత వాసు దేవయ్య ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ పి. పూజిత 591, జి. బిందు మాధవి 574, బి. కార్తీక్ 571 సాధించారన్నారు. 500 మార్కులకుపై 22 మంది విద్యార్థులు సాధించారన్నారు. పాఠశాల మొత్తం 92శాతం వచ్చాయని, విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- చిన్నటేకూరులోని శ్రీ వెంకటేశ్వర ప్రైమరీ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన శ్వేతా (577), పాల్ అభిషేక్ (573), వసంతి (554), చైతన్య (541) లను పాఠశాల యజమాన్యం ప్రత్యేకంగా అభినందించారు.

దళిత వాడల అభివృద్ధిపై చిన్నచూపు తగదు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం దళితవాడల అభివృద్ధిపై చిన్న చూపు చూస్తుందని, ఇందుకు కర్నూలు నగరంలోని 18వ వార్డు జోహరాపురమే నిదర్శనమని ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అరుణమ్మ, అలివేలమ్మ విమర్శించారు. గురువారం ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. స్థానిక తప్పెట గేరిలో చెత్త పేరుకుపోవడం, రోడ్లపైకి మురుగునీరు వస్తుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వారి వెంట సుజాతమ్మ, శ్యామలమ్మ, మాలన్‌బీ, కృమాన్‌బీ, వేణమ్మ, విజయలక్ష్మి ఉన్నారు.

లారీ కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

కర్నూలు (రూరల్) : కర్నూలు మండలం గొందిపర్లలోని టీజీ ఆల్కలీస్ ఫ్యాక్టరీ గేటు ముందు కంపెనీకి సంబంధించిన లారీ కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. అర్బన్ తాలూకా ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ఫ్యాక్టరీ రెండో గేటు వద్ద లారీ వెనుక వ్యక్తి నిలబడివుండగా డ్రైవర్ గమనించకుండా రివర్స్ చేయడంతో అతనిపై చక్రాలు ఎక్కి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు తెలంగాణ రాష్ట్రం జోగుళాంబ గద్వాల జిల్లా కాశీపురం గ్రామానికి చెందిన వ్యక్తి అయ్యి వుండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం



మాట్లాడుతున్న పాణ్యం ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్



కల్లూరులో అంబేడ్కర్, గాంధీ చిత్ర పటాలకు పూలమాల వేస్తున్న ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి

పాణ్యం: మండల కేంద్రమైన పాణ్యంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. అనంతరం సర్పంచ్ మేకల పల్లవి కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ చంద్రమౌళీశ్వర్‌గౌడ్, ఈఓ ఆనందరావు, గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

- కల్లూరు: కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్, మహాత్మా గాంధీ చిత్ర పటాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి పంచాయతీ రాజ్ దినోత్సవం గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాసులు, ఎంపీటీసీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సంచార వైద్య సేవలను పరిశీలిస్తున్న జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు

కల్లూరు: వాతావరణ మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు సూచించారు. గురువారం కల్లూరు మండలం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని కొలంపల్లితండాలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మలేరియా జ్వరం ఆడ అనాఫీలస్ దోమకాటు ద్వారా వ్యాపిస్తుందన్నారు. ఇది మంచి నీటిలో పెరిగి మలేరియా వ్యాధిని వ్యాపింపజేస్తుందన్నారు. ఇంటి పరిసరాలలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని, పరిసరాల శుభ్రత పాటించాలని, దోమ తెరలు వాడాలని సూచించారు. దోమతెరలు వాడటం ద్వారా దోమకాటు నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కృష్ణబాయి, సిబ్బంది గౌరీ, ఏఎన్‌ఎమ్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పద్యంతో సామాజిక చైతన్యం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: పద్యంతో సామాజిక చైతన్యాన్ని కలిగించవచ్చని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ అన్నారు. ప్రముఖ కవి డి.పార్వతయ్య రచించిన ×బొమ్మల గాథలు¶ పుస్తకాన్ని గురువారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్యంతో చైతన్యం కలిగించ వచ్చని బొమ్మల గాథలు పుస్తకంలో వివరించారన్నారు. బసవేశ్వరుడు, పోతులూరి వీరబ్రహ్మం, వేమన లాంటి వారు పద్యం ద్వారా సామాజిక చైతన్యాన్ని కాంక్షించారన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య కళాక్షేత్రం తరుపున రూ. 5వేల చెక్‌ను అందజేశారు. సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు ఎంపీ బసవరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శంకర్ శర్మ, సాహితీ స్రవంతి నగర నాయకులు విజయులు, వెంకటేశ్వర్లు, బసయ్య, విరసం నాయకులు నాగేశ్వరాచారి, కవులు రచయితలు, కళాకారులు మారుతి, డాక్టర్ సుభాన్, షఫీవుల్లా, విశ్రాంత తహశీల్దార్ రోషన్ అలీ, అజయ్‌కుమార్, సీపీఎం నాయకులు రాజశేఖర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పొగబండి!



లారీ నుంచి వెలువడుతున్న పొగ

పాణ్యం : లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ నుంచి వస్తున్న పొగతో అటు వాహనదారులు, రోడ్డుకిరువైపులా ఉండే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గడివేముల జిందాల్ పరిశ్రమ నుంచి నంద్యాల వైపు లోడ్‌తో వెళ్తున్న ఓ లారీ దట్టమైన పొగ వదులుతూ వెనుక వస్తున్న వాహనదారులను ఇబ్బందులకు గురిచేసింది. ఆ లారీ వెళ్లిన రెండు నిమిషాలకు కానీ రోడ్డుపై యథావిధిగా వాహనాలు రాకపోకలు సాగించలేనంతగా కాలుష్యం వెదజల్లింది.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప అన్నారు. కల్లూరు అర్బన్ ముజఫర్ నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన ఎస్.మదీహ - 530, ఎస్ సాఫియా 508, వినీత్ 480లను గురువారం పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థుల అభివృద్ధే ధ్యేయంగా పాఠాలు బోధించారన్నారు. దీంతో పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో వంద శాతం ఫలితాలు సాధించాలని ఉపాధ్యాయులను, విద్యార్థులను కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆనంద్, హుస్సేన్ బాషా, పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణయ్య, ఉపాధ్యాయులు పద్మావతి, మధుమతి, విద్యార్థులు పాల్గొన్నారు.

రమణీయం.. తిమ్మగురుడు స్వామి రథోత్సవం



అశేష భక్త జనుల మధ్య సాగుతున్న తిమ్మగురుడు స్వామి రథోత్సవం

కోడుమూరు రూరల్: గూడూరులో వెలసిన శ్రీతిమ్మగురుడు స్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామి రథోత్సవం అశేష జనవాహిని మధ్య రమణీయంగా సాగింది. ముందుగా రథానికి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పూజలు నిర్వహించి ప్రారంభించారు. వేడుకను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే గాకా, కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి వేలాది మంది ప్రజలు తరలివచ్చారు. ఎస్ఐ తిమ్మయ్య సిబ్బందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



పూజలందుకున్న తిమ్మగురుడు స్వామి

వైభవోపేతం.. ప్రతిష్టోత్సవం





ప్రజలకు అభివాదం చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ఓర్వకల్లు : మండలంలోని సోమయాజులపల్లె గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన సుంకులా పరమేశ్వరీ దేవాలయంలో అమ్మవారి విగ్రహం, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేడుకలను తిలకించేందుకు స్థానికుల ఆహ్వానం మేరకు స్థానిక ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అతిథులకు ఆలయ అర్చకులు ఆలయ మార్యదలతో ప్రత్యేక అర్చనలు చేసి, పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. విగ్రహ మహోత్సవంలో భాగంగా ఆలయ అర్చకులు మోహన్‌శర్మ బృందం వారు అమ్మవారికి ఉదయం ప్రాతఃకాల పూజ, గర్తన్యాస పూజ, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, కుష్మాండబలి, కృష్యగ్నిజ్వాల పూజలు నిర్వహించి ప్రతిష్టోత్సవం జరిపారు. అనంతరం మహా పూర్ణాహుతి, మహా మంగళహారతి, కలశ ఉద్వాసన, వేదాశీర్వచనము నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలో బొడ్రాయిని ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో ఎస్ఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మదన్‌వెంకరెడ్డి, ఆకుల వెంకటరెడ్డి, రామకృష్ణ, అబ్రహాం, భాస్కర్, ఆకుల మహేష్, నాగమల్లేశ్వరుడు, చెన్నంశెట్టిపల్లె కృష్ణారెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడి దారుణం



కోడుమూరులో కొవ్వొత్తులతో నిరసన తెల్పుతున్న ప్రజాసంఘాల నాయకులు



బిలకలగూడూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి చంపడం దారుణమని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఆంధ్రయ్య ఖండించారు. గురువారం రాత్రి ప్రజాసంఘాల నాయకులు కోడుమూరులోని కోట్ల సర్కిల్‌లో మృతుల కుటుంబాలకు సంతాపంగా కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటిస్తూ నిరసన తెలిపారు. ఆంధ్రయ్య మాట్లాడుతూ పహల్గాంలో ఉగ్రవాదులు విచక్షణారహితంగా కాల్పులు జరిపి 26 మంది పర్యాటకులను పొట్టపెట్టుకోవడం దుర్మార్గమన్నారు. ఉగ్రవాదులను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టొద్దని కఠినంగా శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ, సీపీఎం, ఎమ్మార్పీస్, అవాజ్ కమిటీ, ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు రాజు, గఫూర్‌మియ్యా, వీరన్న, తిమ్మన్న, రాజు, నాగేష్, మహమ్మద్, దావూద్ పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

గడివేముల: కశ్మీర్‌లో పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని ఆయా పార్టీల నాయకులు డిమాండు చేశారు. గురువారం మండల పరిధిలోని బిలకలగూడూరు గ్రామంలో కొవ్వొత్తుల నిరసన ప్రదర్శన చేపట్టారు. మృతులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో మైనారిటీ కార్యదర్శి సయ్యద్ ఫరూక్, మాజీ సర్పంచ్ సుదర్శన్ రెడ్డి, మైనారిటీ నాయకులు షేక్ నజీర్ అహ్మద్ (వలి) తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తాం



బిలకలగూడూరులో నష్టపోయిన పొలాలను పరిశీలిస్తున్న జిల్లాస్థాయి అధికారులు

గడివేముల: పంటలు నష్టపోయిన రైతులను న్యాయం చేస్తామని నంద్యాల ఆర్‌డీఓ విశ్వనాథ్, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, ఏఎస్పీ మందా జావళి హామీ ఇచ్చారు. మండల పరిధిలోని బిలకలగూడూరు, బూజునూరు గ్రామాల సరిహద్దుల్లో నిర్మించిన జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యంతో చుట్టు పక్కల ఉన్న పొలాలు దెబ్బతిన్నాయని రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం వారు దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు. గతంలో మండలస్థాయి అధికారులు ఇచ్చిన నివేదికలలో 38 మంది రైతులు 68 ఎకరాల మొక్కజొన్న, జొన్న, మినుము పంటలు దెబ్బతిన్నట్లు పేర్కొన్నారు. వారు మట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వచ్చే కాలుష్యం వలన పంటల దిగుబడులు తగ్గాయని, వాటిని అంచనాలు వేసి జిల్లా కలెక్టర్‌కు నివేదికలు అందజేస్తామన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేస్తామన్నారు. అనంతరం జిందాల్‌లో మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించి సిబ్బందికి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటరమణ, ఏఓ హేమసుందర్‌రెడ్డి, ఎస్ఐ నాగార్జునరెడ్డి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.